# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-02-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఏఐ-నైపుణ్యాభివృద్ధి కల్పనపై వివిధ సంస్థలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకుంది**

2. **రెండవ అఖిల భారత పోలీస్ సౌత్‌జోన్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ ను రాష్ట్ర హోం మంత్రి వి.అనిత ఈ రోజు ప్రారంభించారు.**

3. **గోదావరి పుష్కరాల్లో నది కాలుష్యాన్ని నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

4. **రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.**

==========================

ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతదేశ ఆర్థిక వృద్ధి AI వేగవంతం చేస్తుందనే అంశంపై నిర్వహించిన ప్లీనరీ సమావేశంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద్ తో కలిసి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం, నైపుణ్యాభివృద్ధి కల్పన పై వివిధ సంస్థలతో ముఖ్యమంత్రి సమక్షంలో 7 ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకుంది. అలాగే కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సీఈఓ బోర్కే బ్రెండేతో కలిసి కృత్రిమ మేధస్సు ద్వారా పోటీతత్వం అంశంపై రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని అధికారులు తెలిపారు.

--------------------------

గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్-APSP బెటాలియన్ గ్రౌండ్స్‌లో రెండవ అఖిల భారత పోలీస్ సౌత్‌జోన్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ ఈరోజు ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ ప్రాంతాలకు చెందిన మొత్తం 10 జట్లు ఈ పోటీలో పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మంత్రి అనిత మాట్లాడుతూ, పోలీసుల్లో క్రీడా స్ఫూర్తిని, ఐక్యతను తెలిపేలా ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు.

నిరంతరం విధి నిర్వహణలో ఉండే పోలీసులకు ఇలాంటి క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 25 సెకన్లు

---------------------------

రాష్ట్ర శాసనసభ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ రోజు సభ మొదలైన వెంటనే ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఇందులో భాగంగా గోదావరి పుష్కరాల సందర్భంగా నదీ జలాల కాలుష్యం జరగకుండా తీసుకునే చర్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానమిచ్చారు. 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలు జరగనున్నాయని తెలిపారు. ఈ పుష్కరాల్లో నది పవిత్రతను కాపాడటం సహా కాలుష్యాన్ని నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. భక్తుల రద్దీ పెరిగే అంచనాతో స్నాన ఘట్టాల సంఖ్యను పెంచామని వివరించారు. వివిధ శాఖల సమన్వయంతో నది కాలుష్యం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి సూచనలను కూడా పాటిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

గోదావరి పుష్కరాలు జరిగే నియోజకవర్గాల్లో రహదారులును ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తామని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ. జనార్ధన్ రెడ్డి తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధిపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, కొవ్వూరు నియోజకవర్గంలో కొన్ని రోడ్లు మాత్రమే పాక్షికంగా దెబ్బతిన్నాయని, వివిధ పథకాల కింద రహదారుల మరమ్మతులు, మెరుగుదల కోసం 50.74 కోట్ల రూపాయలను మంజూరు చేశామని చెప్పారు. ఇప్పటికే పనులు కొన్ని పూర్తయ్యాయని మిగిలినవి పురోగతిలో ఉన్నాయని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 25 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరు పై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో డ్వాక్రా సంఘాలను మహిళల ఆర్థిక సాధికారతకు ఉపయోగపడేలా ప్రణాళికల రూపొందిస్తున్నామని తెలిపారు. బ్యాంకింగ్ రుణాలను మరింత సులభతరం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలియజేస్తూ

వాయిస్ 32 సెకన్లు

---------------------------

విశాఖపట్నంలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ-2026లో భాగంగా ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియం కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో హిందూ మహా సముద్రం, పసిఫిక్ ప్రాంతానికి చెందిన నావికా దళాల అధిపతులు, ఉన్నతాధికారులతో పాటు వివిధ దేశాల నౌకాదళ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సముద్ర తీర దేశాల మధ్య పరస్పర సహకారం, అభివృద్ధి, సాంకేతిక మార్పిడి వంటి అంశాలపై

చర్చిస్తున్నారు.

---------------------------

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జనాభా లెక్కల సేకరణ 2027 పై ప్రధాన జనాభా గణన అధికారులతో రాష్ట్రస్థాయి సమావేశం ఈ రోజు ప్రారంభమైంది. ఈ సమావేశంలో జనాభా లెక్కల సేకరణ–2027 కు సంబంధించిన సన్నద్ధత వంటి ఇతర అంశాలపై చర్చించనున్నారు. డిజిటల్ పరికరాల నిర్వహణ, క్షేత్రస్థాయిలో సమాచార సేకరణపై జనాభా గణన అధికారులకు మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సమావేశానికి సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ వివిఎల్ఎన్ శర్మ, రాష్ట్ర జనాభా గణన డైరెక్టర్ జె.నివాస్, రాష్ట్ర స్థాయి సెన్సస్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, జిల్లాల నుండి సంబంధిత అధికారులు హాజరయ్యారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

చిత్తూరు జిల్లాలో ఒక యువకుడికి ఏవియన్ ఇన్ఫ్లుయెంజా –బర్డ్ ఫ్లూ సోకినట్లు జరుగుతున్న ప్రచారం లో వాస్తవం లేదని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండియన్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ యువకుడికి ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవని అతని నుంచి సేకరించిన నమూనాను ప్రయోగశాలలో పరీక్షించగా రిపోర్ట్ నెగటివ్ అని వచ్చిందని స్పష్టం చేశారు. ఇలాంటి అసత్య ప్రచారం ప్రజలు నమ్మవద్దని సూచించారు.

---------------------------

కేంద్రప్రభుత్వ పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ ఆర్థిక, సామాజిక భద్రత కల్పించేందుకు కృషి చేస్తున్నామని 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. తిరుపతిలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కేంద్రప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద అర్హులైన వారికి ఇళ్లను మంజూరు చేస్తున్నామని, జల్ జీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నామని తెలిపారు.

---------------------------

తూర్పుగోదావరి జిల్లా కోటనందూరు మండలంలోని పి. కొట్టం గ్రామంలో పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా 'ఫ్రైడే – డ్రైడే' కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆరోగ్య సహాయకులు అప్పలనాయుడు, ఆశా కార్యకర్తలు పాల్గొని ఆరోగ్యపు అలవాట్లపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

=====================